క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి

సంతకవిటి: గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయని, వైద్య శాఖ అప్రమత్తంగా ఉండాలని, తరచూ ప్రజలకు అవగాహన కల్పించాలని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సంతకవిటి, మండాకురిటి పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందితో పాటు గ్రామ సచివాలయ ఆరోగ్య కార్యదర్శులతో సమావేశమైన ఆయన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని, జ్వరాల బారిన పడినవారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. పరిస్థితులు చేయి దాటకముందే సలహాలు అందించి, ఉన్నత వైద్యం అవసరమైన వారికి పట్టణాల్లోని ప్రభుత్వాస్పత్రులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.మంజుల, పీహెచ్‌సీ వైద్యాధికారులు నాగేంద్రప్రసాద్, ప్రశాంత్, ఎంపీడీఓ జి.వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: స్థానిక పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు శుక్రవారం భూమిపూజ చేశారు. దాదాపు రూ.20 లక్షల వ్యయంతో 26, 28, 29వ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టనున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా బొబ్బిలి అభివృద్ధి జరుగుతోందని, దీనికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనే కారణమన్నారు. మరోసారి ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైస్ చైర్‌పర్సన్ రమాదేవి, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ ఆర్.ఈశ్వరరావు(విను), మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15న విద్యార్థులకు నగదు బహుమతులు



ప్రధానోపాధ్యాయుడికి నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ రామారావు

బాడంగి: జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు ఉత్తమ విద్యార్థులను సన్మానించి, ప్రోత్సహించేందుకు ముందుకువచ్చారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2022–23 విద్యాసంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన పలువురికి నగదు బహుమతులు అందివ్వాలని రూ.10,500లను ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణకు శుక్రవారం అందజేశారు. ఈ ప్రోత్సాహక బహుమతులను ఆగస్టు 15వ తేదీన స్వాతంత్య్ర దినోత్సవం నాడు తన తండ్రి స్వర్గీయ సింహాచలంనాయుడు పేరుమీద అందివ్వాలని కోరారు. ఈ మేరకు జెడ్పీటీసీకి సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.

పనుల నాణ్యతలో రాజీ పడొద్దు



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

వంగర: అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడొద్దని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని మగ్గూరులో నిర్మిస్తున్న రోడ్డును పరిశీలించిన నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. మండలంలోని మామిడివలస గ్రామంలో సర్పంచ్ మూడడ్ల అప్పలనాయుడు, ఎంపీడీఓ రమామణితో కలిసి ఎంపీపీ శుక్రవారం మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా ఓ మొక్కను నాటి, పరిరక్షించాలని కోరారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఇంటా 'సంక్షేమ' వెలుగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి:

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అప్పాపురం, మజ్జిరాముడుపేట గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, ఓ వైపు అభివృద్ధి పనులు జోరుగా చేపడుతూనే మరోవైపు నిర్విరామంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పథకాలు అందుతున్నాయని, దీంతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకే తీసుకువచ్చేలా ఆయన ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శమన్నారు. గతంలో టీడీపీ తన మేనిఫెస్టోలోని ఇచ్చిన హామీల్లో ఒక శాతం కూడా నెరవేర్చలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తన మేనిఫెస్టోలోని 98 శాతానికి పైగా హామీలను నెరవేర్చిందన్నారు. ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్‌తో కలిసి రాష్ట్రంలో అల్లర్లు సృష్టించే పనిలో టీడీపీ ఉందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నేతలు మరోసారి తమ మాయమాటలతో ప్రజలను మోసగించేందుకు సిద్ధమయ్యారని, వారిని నమ్మి ఓట్లు వేస్తే ఇప్పటి సంక్షేమ పథకాలన్నీ మాయమవుతాయన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహనరావు, సర్పంచ్ కె.నిర్మల, పార్టీ నాయకులు కె.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కె.దుర్గారావు, ఎంపీడీఓ నాగమణి, తహసీల్దార్ టి. కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: అప్పాపురంలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే జోగులు

అర్హులందరికీ పథకాలు..

తెర్లాం: అర్హులందరికీ నవరత్నాల పథకాలతో పాటు, ఇతర సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని లోచర్ల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతీ గడపకు వెళ్లి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా ప్రజలకు కలుగుతున్న లబ్ధిని వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని, గతంలో ఏ ముఖ్యమంత్రి అమలుచేయనన్ని పథకాలను సీఎం జగనన్న అమలు చేస్తున్నారన్నారు. గతంలో టీడీపీ హయాంలో దళారులు, మధ్యవర్తులు, జన్మభూమి కమిటీల సిపార్సులు ఉంటేనే పథకాలు అందేవన్నారు. ఇప్పుడు అన్ని వర్గాలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేయడం జరుగుతోందన్నారు. దీంతో పాటు పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుని ఖాతాకు బదిలీ చేయడం ద్వారా పథకాల్లో అవినీతి లేదన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరగలేదని, ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. 2024 ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మళ్లీ అధికారం ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బొబ్బిలి, తెర్లాం మండలాల పార్టీ అధ్యక్షులు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎన్.బాబ్జీరావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, లోచర్ల సర్పంచ్ జి.దాలమ్మ, పార్టీ సీనియర్ నాయకులు ఎం.జగన్నాథం, టి.సత్యంనాయుడు, బి.అప్పలనాయుడు, ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ, తహసీల్దార్ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



తెర్లాం: లోచర్లలో లబ్ధిదారుకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రైతులకు అండగా నిలవాలి

- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఎమ్మెల్యే కంబాల జోగులు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: ఖరీఫ్ సాగు పూర్తయ్యేవరకు అన్నిశాఖల అధికారులు రైతులకు అండగా నిలవాలని ఎమ్మెల్యే కంబాల జోగులు సూచించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పాల్గొన్న ఆయన వ్యవసాయ శాఖతో పాటు ఇరిగేషన్, ఎన్ఆర్ఈజీఎస్ శాఖలు సంయుక్తంగా కలిసి పనిచేయాలన్నారు. మండలంలో వరి, మొక్కజొన్న సాగు వివరాలు తెలుసుకుని, రైతులకు సరిపడే ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు సేవలందించాలని, సాగునీటి కొరత లేకుండా ఇరిగేషన్ అధికారులు చూడాలని తెలిపారు. ఇప్పటికే వర్షాలు తక్కువగా ఉండడంతో రైతులకు నీటి ఇబ్బందులు ఉన్నాయని, వీటిని అధిగమించే దిశగా రైతులకు ప్రణాళికలు ఇచ్చి, అవగాహన కల్పించాలని కోరారు. రసాయన ఎరువుల వినియోగంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వర్షాలు పడుతున్న సమయంలో పిడుగులు పడితే కలిగే ఇబ్బందులు, పంటపొలాల్లో విషసర్పాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రతీ గ్రామంలోని రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కె.అప్పారావు, వ్యవసాయ శాఖ ఏడీఏ కె.చంద్రరావు, ఏఓ రేణుకాసాయి, తోటపల్లి కాలువ డీఈఈ నవీన్, ఏఈలు విశ్వేశ్వరరావు, అప్పలనాయుడు, ఎంపీడీఓ బి.శంకరరావు, వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు, వైస్ ఎంపీపీలు ఎల్.వెంకటేష్, ఎస్.వర్షిణి, ఏపీఓ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించడమే ధ్యేయం

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



తోటపల్లి పిల్లకాలువ ద్వారా సాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: తోటపల్లి ప్రధాన కుడికాలువ నుంచి పిల్లకాలువలు నిర్మించి, పంట పొలాలకు సాగునీరందించడమే ప్రభుత్వ ధ్యేయమని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని రాజయ్యపేట, నందిగాం గ్రామాల్లోని వెయ్యి ఎకరాల పంట పొలాలకు సాగునీరు అందేలా తన సొంత నిధులతో నిర్మించిన పిల్లకాలువను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించి, సాగునీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల నందిగాంలో పెట్రోల్ బంక్ ప్రారంభించేందుకు వచ్చినప్పుడు పిల్లకాలువ పనులు మధ్యలో నిలిచిపోయాయన్న విషయాన్ని తన దృష్టికి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారన్నారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన పిల్లకాలువ పనులను తన సొంత నిధులతో పూర్తి చేసి, రైతులకు సాగునీరు అందేలా చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులో సామూహిక గృహప్రవేశాలు!



అధికారులతో చర్చిస్తున్న డీఈఈ అప్పయ్య

బాడంగి: బొబ్బిలి సబ్‌డివిజన్ పరిధిలోని జగనన్న కాలనీ లేఅవుట్లలో ఈ నెలాఖరుకు మొత్తం 5,940 ఇళ్లల్లో సామూహిక గృహప్రవేశాలు చేయించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని హౌసింగ్ డీఈఈ పి.అప్పయ్య అన్నారు. శుక్రవారం స్థానిక హౌసింగ్ సెక్షన్ కార్యాలయంలో జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణాలు–గృహప్రవేశాలపై అధికారులతో చర్చించిన ఆయన శ్లాబ్ లెవల్, పూర్తిస్థాయి నిర్మాణం జరిగిన ఇళ్ల చోకపిట్లు ఏర్పాటు చేసుకోవాలని అందుకు ప్రభుత్వం ఒక్కోదానికి రూ.6 వేలు అందించనుందని తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న వారు ఇంజినీరింగ్ అధికారులతో అంచనా విలువ రూపొందించి, బిల్లుల కోసం తమకు వాటిని పంపించాలన్నారు. మండలంలో గృహ నిర్మాణాల ప్రగతి బాగుందని, నియోజకవర్గంలో మొత్తం 10,959 ఇళ్లు కాగా, వీటిలో 5,935 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. మండలంలోని తెంటువలస జగనన్న కాలనీ లేఅవుట్‌లో హౌసింగ్ డే చేపట్టారు.

బొబ్బిలి: ఈ నెల 22వ తేదీన జగనన్న కాలనీల్లో సామూహిక గృహప్రవేశాలకు సన్నద్ధం కావాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో హౌసింగ్, సచివాలయ ఉద్యోగులతో శుక్రవారం సమావేశమైన ఆయన గృహనిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలని తెలిపారు.

పోస్టాఫీసుల్లో త్రివర్ణపతాకాల విక్రయాలు

రాజాం సిటీ: ప్రతీ పోస్టాఫీసులో త్రివర్ణపతాకాలు విక్రయిస్తున్నట్లు రాజాం బ్రాంచి పోస్టల్ శాఖ అధికారి డీవీఎస్ ప్రతాప్ తెలిపారు. శుక్రవారం స్థానిక పట్టణ మెయిన్‌రోడ్డులో జెండా విక్రయాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ భారతీయుని మదిలో దేశభక్తి పెంపొందించాలనే సదుద్దేశ్యంతో కేంద్రం ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతీ ఇంటిపై మువ్వన్నెల జెండా రెపరెపలాడాలన్న ఉద్దేశ్యంతో జెండాను రూ.25లకే విక్రయిస్తున్నామని, కావాల్సిన వారు అందుబాటులోని పోస్టాఫీసులో గానీ ఆన్‌లైన్‌లో గానీ కొనుగోలు చేసుకోవచ్చన్నారు.

బాడంగి: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని, మండలంలోని డొంకినవలస సబ్ పోస్టాఫీస్ పరిధిలోని 11 బ్రాంచ్ పోస్టాఫీసుల్లో త్రివర్ణ పతాకాలు విక్రయిస్తున్నట్లు పోస్టల్ శాఖ అధికారులు తెలిపారు. అలాగే రాఖీ పౌర్ణమి సందర్భంగా రూ.18కు ఒక్కో రాఖీ కవరును అందుబాటులో ఉంచామన్నారు.

చురుగ్గా ఈ–క్రాప్ నమోదు

రేగిడి: మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ చాలా చురుగ్గా జరుగుతోందని ఏఓ జి.మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపురం, అక్కన్నఅగ్రహారం, చాటాయవలస గ్రామాల్లో జరుగుతున్న ఈ–క్రాప్ నమోదును ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. రైతుల భూముల సర్వే నంబర్ల ఆధారంగానే ఈ–క్రాప్ నమోదు చేయాలని తెలిపారు.

తెర్లాం: రైతులు పండించే అన్ని పంటలకు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేపట్టాలని ఏఓ జి.సునీల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కుసుమూరులో జరుగుతున్న ఈ–క్రాప్ నమోదును పరిశీలించిన ఆయన ఈ–క్రాప్ నమోదు చేసుకోని పక్షంలో రైతులు తాము పండించే పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునే సదుపాయం ఉండదన్నారు.

పథకాలతో మహిళలకు మేలు

రాజాం సిటీ: ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు కల్పిస్తున్న పథకాలతో ఎంతో మేలు చేకూరుతోందని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు అన్నారు. శుక్రవారం వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం నాలుగో విడత నిధుల విడుదల కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని సత్యనారాయణపురం సచివాలయంలో వీక్షించారు. ఆయన మాట్లాడుతూ రాజాం మున్సిపాలిటీ పరిధిలోని 792 స్వయం శక్తి సంఘాలకు గాను 8,334 మంది మహిళలు ఉన్నారని, వీరికి రూ.1.27 కోట్ల మేర సున్నా వడ్డీ రూపంలో లబ్ధి చేకూరిందని తెలిపారు. ప్రతీ మహిళ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు.

అందరి సహకారంతోనే మండల అభివృద్ధి

- జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు



మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు

సంతకవిటి: అందరి(అన్ని శాఖల అధికారులు, అన్ని పంచాయతీల ప్రజాప్రతినిధులు) సహకారంతోనే మండలంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహనరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సిరిపురపు మంజుల అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతీ పంచాయతీ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు. ప్రతీ పంచాయతీలో కోట్లాది రూపాయలతో పక్కా భవనాల నిర్మాణం జరుగుతోందని, ఇందులో ప్రతీ ఒక్కరి కృషి, సాయం ఉందన్నారు. అంతకుముందు పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏకపక్షంగా జరిగిన ఈ సమావేశంలో మండలంలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఇసుక కొరత ఉన్నట్లు తెలిసిందని, ఇసుక పంపిణీకి చర్యలు చేపట్టాలని తహసీల్దార్ ఎ.సులోచనారాణికి జెడ్పీ వైస్ చైర్మన్ సూచించారు. ప్రజాప్రతినిధులకు తెలియకుండా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు తమ పంచాయతీలో వినియోగిస్తున్నారని, అవి ఎవరికి అందుతున్నాయో తమకు తెలియని పరిస్థితి ఉందని చిన్నయ్యపేట సర్పంచ్ రూపిటి రమణమ్మ సమావేశం దృష్టికి తీసుకురాగా, సంబంధిత ఐసీడీఎస్ కార్యకర్తలకు నోటీసులు ఇస్తామని సూపర్‌వైజర్ ఎం.వి.రత్నం హామీఇచ్చారు. విద్యుత్ శాఖపై జరిగిన సమీక్షలో పాడైన విద్యుత్ స్తంభాలు మార్చాలని పలువురు సభ్యులు కోరగా, వాటిని మారుస్తామని ఏఈ షేక్ సయ్యాద్ తెలిపారు. రైతులకు అందుబాటులో యూరియా ఉందని ఏఓ పైల నవీన్, అన్ని పాఠశాలలకు సరిపడే పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందని ఎంఈఓ భాస్కరరావు తెలిపారు. ఉపాధి హామీ సమీక్షలో నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా ప్రతీ పంచాయతీకి 75 మొక్కలు ఇస్తున్నట్లు ఈసీ మురళి వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.పాపారావు, ఎంపీడీఓ జి.వి.రవికుమార్, తహసీల్దార్ సులోచనారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు

తెర్లాం: బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు తన సొంత నిధులతో మండలంలోని ఆమిటి–తెర్లాం బీటీ రోడ్డు మరమ్మతు పనులను చేయిస్తున్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా నడపలేని దుస్థితిలో ఉన్న ఆ రోడ్డు సమస్యను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే, ఆయన సోదరుడు బొబ్బిలి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు దృష్టికి గ్రామస్తులు, స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు తీసుకువెళ్లారు. స్పందించిన వారు తమ సొంత నిధులతో రోడ్డు మరమ్మతు పనులకు ముందుకు రావడం విశేషం. శుక్రవారం నుంచే ఈ పనులు కూడా ప్రారంభించారు. అలాగే బీటీ రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రోడ్డు మరమ్మతులు చేయిస్తున్నందుకు ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్తంగా...

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

రాజాం: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని యాక్సిస్ టు జస్టిస్ ఫేజ్–2 ప్రోగ్రాం వైసీబీ కమ్యూనిటీ సోషల్ కో–ఆర్డినేటర్ వి.లక్ష్మినారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని పొగిరి జెడ్పీ హైస్కూల్‌లో బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాల్యవివాహాల నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలను విద్యార్థులకు వివరించారు. అనంతరం 8, 9, 10 తరగతుల విద్యార్థినులకు బాలల హక్కులు–చట్టాలు, బాల్యవివాహాల రద్దు వంటి అంశాలపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

పుస్తకాలు అవసరమైతే అందిస్తాం

రేగిడి: ప్రభుత్వ పాఠశాలలకు ఈ ఏడాది సరిపడ పుస్తకాలు అందించామని, ఇంకా ఎక్కడైనా కొరత ఉంటే అందిస్తామని జిల్లా నోట్‌బుక్ మేనేజర్ సతీష్‌కుమార్, గవర్నమెంట్ టెస్టు బుక్స్ ప్రెస్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని దేవుదళ గ్రామంలోని కేజీబీవీకి చేరుకుని, పుస్తకాలపై ఇన్‌చార్జ్ ఎస్‌ఓ వి.చిన్నతల్లిని ఆరాతీశారు. ప్రభుత్వ పాఠశాలలకు ఇంకా పుస్తకాలు కావాలంటే స్థానిక ఎంఆర్‌సీకి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

'వైఎస్సార్ కంటివెలుగు'తో అంధత్వ నివారణ

బొబ్బిలి: అంధత్వ నివారణే ధ్యేయంగా ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం అమలు చేస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని 29వ వార్డులో పిరిడి వైద్యురాలు ఆర్.సునీత ఆధ్వర్యంలో చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఎవరైనా కంటి సమస్యలతో బాధపడితే వెంటనే తనిఖీలు చేయించుకోవాలన్నారు. 50 మంది కళ్లను వైద్య సిబ్బంది తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తామన్నారు.

దుప్పట్ల పంపిణీ

రాజాం: మండలంలోని పొగిరి లెప్రసీ ఆస్పత్రి వద్ద రోగులకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. తెర్లాం మండలంలోని బూరిపేటకు చెందిన డి.దివ్య వర్థంతి సందర్భంగా కుటుంబ సభ్యులు వీటిని రోగులకు అందించి, అనంతరం ఆహార పొట్లాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బూరిపేట సర్పంచ్ డి.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

రేగిడి: మండలంలోని చాటాయివలస సచివాలయం పరిధిలోని, ఉప్పర్నాయుడువలస, వన్నలి, చాటాయివలస గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సచివాలయ పరిధిలో మంజూరైన దాదాపు రూ.20 లక్షల నిధులతో అవసరమైన చోట సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నట్లు సర్పంచ్ గోవిందరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలు పరిష్కారమవుతుండడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపడాలి

రామభద్రపురం: అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపడాలని, ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి గోవిందరావు ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమావేశమైన ఆయన అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తాను ఇప్పటికే 4 నుంచి 5 అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశానని, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదన్నారు. వైద్యాధికారులు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఎంపీడీఓ రమామణి, వైద్యాధికారులు శిరీష, దీపక్‌కుమార్, పశువైద్యాధికారిణి హిరణ్య, ఎంఈఓ పెంటయ్య పాల్గొన్నారు.

సచివాలయాలతోనే గ్రామస్వరాజ్యం

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



కొత్తగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతోనే మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఎం.బూర్జివలస గ్రామంలో రూ.61.80 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన సచివాలయ, రైతు భరోసా కేంద్రం భవనాలను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ రెండు వేల జనాభాకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలతో పాటు సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం ప్రతీ గ్రామంలో సచివాలయాలు ఏర్పాటు చేసిందన్నారు. ఓ వైపు శరవేగంగా అభివృద్ధి, మరోవైపు నిర్విరామంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల్లో మరింత ఆదరణ సంపాదించుకుంటున్న ప్రభుత్వంపై అక్కసుతోనే టీడీపీ అధినేత చంద్రబాబు అండ్ కో.. లేనిపోని విమర్శలు చేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ పాలనకు ఇప్పటి పాలనకు ఉన్న స్పష్టమైన తేడా ప్రజలకు బాగా తెలుసన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నిధులు కుమ్మరించిన ప్రాజెక్టులను చంద్రబాబు ఆయన పార్టీ నేతలు సందర్శించి, అభివృద్ధి ఏమీ లేదని సెల్ఫీ చాలెంజ్‌లు విసరడం సిగ్గుచేటన్నారు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా.. అన్నట్టు ఇక్కడ బేబీ నాయన వీఆర్ఎస్ కాలువలు చూసి సెల్ఫీలు దిగుతున్నారన్నారు. వారు 15 ఏళ్ల కాలంలో చేసిందేమీ లేకపోయినా ఫొటోలకు లోటులేదని విమర్శించారు. చంద్రబాబు, కరువు కవల పిల్లలని, అందుకే ఆయన తిరిగిన ప్రాంతాల్లో వర్షాలు కురవడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ ముఖ్యమంత్రిగా సీఎం జగనన్ననే గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మీవేణుగోపాలనాయుడు, పీఆర్ డీఈఈ సీహెచ్‌వి అప్పారావు, వ్యవసాయ శాఖ ఏడీ ఎం.శ్యామసుందరరావు, ఎంపీడీఓ పి.రవికుమార్ వైస్ ఎంపీపీ ఎ.శంకరరావు, ఎంపీటీసీ జి.దేవి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం..

తెర్లాం: మండలంలోని లోచర్ల గ్రామంలో రూ.21.80 లక్షల నిధులతో కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు విత్తనం దగ్గర నుంచి పంట విక్రయం వరకు అవసరమైన అన్ని సదుపాయాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి, తెర్లాం మండలాల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎన్.బాబ్జీరావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, సర్పంచ్ దాలమ్మ, ఎంపీడీఓ రామకృష్ణ, ఏఓ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.